## కాంగ్రెస్ మాటల గారడీతో రైతుకు కష్టాలు



అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ మాటల గారడీ చేస్తున్నది. రైతులను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం సరికాదు. తాజాగా రేవంత్‌రెడ్డి రైతుబంధును భూమి యజమానికి ఇస్తే.. కౌలు రైతుకు రాదు. కాబట్టి, భూమి యజమానికిగానీ, కౌలు రైతుకుగానీ.. ఎవరో ఒకరికే ఇస్తామంటున్నారు. ఇది విడ్డూరంగా ఉంది. ఆయన చెబుతున్న మాటలనుబట్టి.. కాంగ్రెస్ హామీలన్నీ బూటకమేనని అర్థమవుతున్నది. తెలంగాణ ప్రభుత్వంలో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు. 24 గంటల కరెంటుతోపాటు రైతుబంధు వస్తున్నది. చెరువుల్లో పుష్కలంగా నీళ్లు ఉంటున్నాయి. రైతులకు అవసరమైనవన్నీ కేసీఆర్ సార్ చేశారు. రైతులకు ఇంకేమి కావాలి..? తమకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని రైతులు వద్దనుకుంటారా..? మళ్లీ కేసీఆర్ సారే అధికారంలోకి రావాలి. అప్పుడే రైతులకు మరింత మేలు జరుగుతుంది. కాంగ్రెస్ వద్దు. వాళ్ల మూడు గంటల కరెంటు వద్దు.

**– బండారి దశరథ, రైతు, మోరంపల్లిబంజర్, బూర్గంపహాడ్ మండలం**


## సీఎం కేసీఆర్.. రైతు బాంధవుడు



తెలంగాణ ప్రభుత్వం.. రైతులను రాజుగా మార్చింది. రైతుబంధు ఇచ్చిన కేసీఆర్.. తుబాంధవు డయ్యారు. 24 గంటల నిరంతర విద్యుత్ ఇవ్వడంతో రైతులు ఎంతో సంతోషంగా పంటలు పండించుకుని ఆర్థికంగా ఎదిగారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్నీ కష్టాలే. చీకటి రోజులు గడిపాం. వ్యవసాయానికి కరెంటు లేదు. ఎప్పుడు వస్తుందో...ఎప్పుడు పోతుందో తెలియదు. పొలం గట్లపై, పొలాల్లో కరెంటు కోసం ఎన్నో రాత్రిళ్లు పడిగాపులు పడ్డాం. ఆనాడు వ్యవసాయం చేయాలంటే కత్తి మీద సాములా ఉండేది. కేసీఆర్ పాలన.. రైతులకు స్వర్ణయుగమైంది. 24 గంటల కరెంటుతో రైతు పంటల్లో బంగారం పండుతున్నది. కేసీఆర్‌కే రైతులంతా మద్దతుగా నిలుస్తారు. మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తారు. ఆయనను ముఖ్యమంత్రిగా చూస్తాం. రైతుల మద్దతు కేసీఆర్‌కే.

**– వంకా పంతులు, రైతు, తుమ్మలచెరువు కొత్తూరు, అశ్వాపురం మండలం**

## 24 గంటల కరెంటే కావాలి



తెలంగాణ ప్రభుత్వంలో రైతులు బాగుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పడ్డ కష్టాలను గుర్తుకు తెచ్చుకోవాలంటేనే భయమేస్తోంది. ఏ సమయంలో కరెంటొస్తదో తెలియదు. వచ్చినప్పుడే పరిగెత్తుకుంటూ పోయి పంటలకు నీళ్లు కట్టాల్సి వచ్చేది. కొన్నిసార్లు అయితే పొలాల్లోనే పడుకొని రాత్రి పూట కరెంట్ వస్తే చీకట్లోనే పొలం గట్లపై నడుచుకుంటూ వెళ్లి పొలమంతా తడిసేంత వరకు అక్కడే జాగారం చేయక తప్పేది కాదు. కానీ మా కష్టాలు తొలగించడానికి సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారు. ఉచితంగా 24 గంటలు కరెంట్ ఇచ్చారు. రెండు పంటలు పండించుకుంటున్నాం. మా మద్దతు కేసీఆర్ సార్‌కే.

**– నదికట్టు రోషిరెడ్డి, రైతు, వేపలగడ్డ, కొత్తగూడెం**



# భూములన్నీ మళ్లీ బీళ్లు

## రైతులకు నిత్యం కన్నీళ్లు



- రైతుల బతుకులను ఆగం చేసేలా కాంగ్రెసోళ్ల మాటలు
- పాత రోజులను తలచుకుంటూ దిగులుపడుతున్న కర్షకులు
- కరెంటు లేక.. మడులకు నీరు పారక అర్ధరాత్రులు అవస్థలు
- ధరణిని తీసివేస్తే దగాకోర్ల రాజ్యమేనంటున్న రైతులు
- సీఎం కేసీఆర్ పాలనలో 24 గంటల విద్యుత్‌తో పుష్కలంగా పంటలు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెసోళ్ల మాటలు వింటున్న రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. 2014కు ముందున్న పరిస్థితులను గుర్తు చేసుకుంటూ దిగులు చెందుతున్నారు. కాంగ్రెస్ హయాంలో ఒక వైపు సక్రమంగా సాగునీరు లేక, కరెంటు సరిగ్గా రాక.. తెల్లవారుజామున వచ్చే త్రీఫేజ్ కరెంటు కోసం పడిగాపులు కాస్తూ తడిపెట్టిన పంట పొలాల పరిస్థితిని వారు ఇంకా మర్చిపోలేదు. మరోవైపు ఎరువుల కొరత ఎక్కువగా ఉండడంతో షాపుల వద్ద బారులు తీరిన సందర్భాలు కోకొల్లలు. రైతులు సమావేశాలు పెట్టుకోవాలంటే చెట్ల కిందనే మీటింగ్‌లు పెట్టుకునే పరిస్థితి ఉండేది. ఇవన్నీ ఎలా మర్చిపోతామని పలువురు రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

### ధరణి తీసేస్తే ఆగమే..

గతంలో పాస్ పుస్తకాల కాలం. దీంతో ఎవరి భూమి ఎక్కడుందో తెలియని పరిస్థితి. పాస్ పుస్తకాల్లో కేవలం నెంబర్లు మాత్రమే ఉండేవి. కానీ.. రైతులు మాత్రం మా పొలం మా దగ్గరే ఉందనే నమ్మకంతో సాగు చేసుకుంటున్న పరిస్థితి. అయితే పాస్ పుస్తకాల్లో సర్వే నెంబర్లు మార్పు చేసిన వీఆర్వోలు రైతుల మధ్య పెద్ద పెద్ద గొడవలే సృష్టించారు. ఆమ్యామ్యాలకు అలవాటుపడి ఒకరి పొలం సర్వే నెంబర్లు ఇంకొకరికి పాస్ పుస్తకాల్లో ఎక్కించి రైతుల కుటుంబాలను ఇబ్బందులపాలు చేశారు. ఇవన్నీ పాత రోజులు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో నూతన మార్పులు తీసుకురావడంతోపాటు రైతులకు 24 గంటలు కరెంటు రావడంతో రైతులు రెండు పంటలు పండించుకునే అవకాశం కలిగింది. దీంతో ధరణిని అందుబాటులోకి తేవడంతో రైతుల పొలాల సర్వే నెంబర్లు ఆన్‌లైన్ చేశారు. ఎప్పటి నుంచో ఉన్న సర్వే నెంబర్ల సమస్య ఒక కొలిక్కి వచ్చింది. మళ్లీ కాంగ్రెస్ వస్తే పటేల్, పట్వారీ, వ్యవస్థ వల్ల దోపిడీదారుల వ్యవస్థ వస్తుందేమోనని రైతులు భయపడుతున్నారు. దీనిని చాలా మంది మేధావులు, రైతులు, ప్రజలు తిరస్కరిస్తున్నారు.

### చివరికి వ్యవసాయం ఆగమే అంటున్న రైతన్నలు

సక్కపడ్డ వ్యవసాయ రంగంలో మళ్లీ పాత పద్ధతులు వచ్చే అవకాశాలు లేకపోలేదు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. పాత పద్ధతిలో సొసైటీల ద్వారా ఎరువులు ఇవ్వడం వల్ల పెద్ద రైతులకు మాత్రమే ఎరువులు లభించే పరిస్థితి ఉంటుంది. దీంతో చిన్న రైతులు వ్యవసాయానికి దూరమయ్యే ప్రమాదం ఉంది. చిన్న కమతాలలో వ్యవసాయం చేయలేక మళ్లీ కూలీలుగా మారే పరిస్థితి ఉండబోతుంది. ధరణిని తీసేస్తే కౌలు రైతులకు రైతుబంధు ఇచ్చే ప్రతిపాదనను కాంగ్రెస్ తీసుకొస్తామంటున్న తరుణంలో రైతులు పొలాలను కౌలుకు ఇచ్చే పరిస్థితి ఉండదు. దీంతో సక్కబడ్డ సాగు భూములన్నీ మళ్లీ బీళ్లుగా మారబోతాయని రైతులు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటల పట్ల ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతులు, రైతు కూలీలు, చిరు వ్యాపారులు, గృహిణులు మండిపడుతున్నారు. ఒకవైపు ధరణి తీసివేయడంతోపాటు మరోవైపు మూడు గంటల కరెంట్‌పై పదే పదే మాట్లాడుతుండడంతో ఆ పార్టీ నాయకులకు ఎన్నికల్లో తగిన రీతిలో సమాధానం చెబుతామని పేర్కొంటున్నారు.

## అవినీతిని నిర్మూలించిన ఏకైక సీఎం కేసీఆర్



ధరణి గురించి కాంగ్రెసోళ్లకు తెలియక మాట్లాడుతున్నారు. నాడు తహసీల్దార్ కార్యాలయం, వీఆర్వోల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగాం. నేడు సీఎం కేసీఆర్ సారు ధరణి ప్రవేశపెట్టి అవినీతి వ్యవస్థను నిర్మూలించారు. పట్టాలు కావాలన్నా, భూమి వివరాలు చూడాలన్నా క్షణాల్లో జరిగిపోతుంది. ఎవరికి లంచం ఇవ్వాల్సిన అవసరం లేదు. భయపడాల్సిన అవసరం అంతకన్నా లేదు. సీఎం కేసీఆరే మా ధైర్యం.

**– కుంజ ఈశ్వరి, ఒడ్డుగూడెం పంచాయతీ, ఇల్లెందు మండలం**

## ధరణి లేకుంటే.. రైతులకు కష్టాలే



గతంలో భూములకు భరోసా ఉండేది కాదు. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో మా భూములకు భరోసా ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం రాక ముందు పటేల్, పట్వారీ సంతకం పెట్టేవారు కాదు. గిర్దావర్, తహసీల్దార్ సంతకాలు పెడితే అయ్యేది. ఇదంతా జరిగేందుకు రెండు నెలలు పట్టేది. డబ్బుల కోసం తిప్పించుకునేటోళ్లు. ఇప్పుడు ఆ బాధలు లేవు. రైతులు ప్రశాంతంగా ఉన్నారు. ఇది కాంగ్రెసోళ్ళకు ఇష్టం లేనట్లుంది. అందుకే, ధరణిని తీసేస్తామని అంటున్నారు. వారి మాటలు నమ్మి ఓటేస్తే.. రైతుల పరిస్థితి ఆగమైతది. భూ సమస్యలు ఉండొద్దనుకుంటే.. ధరణి ఉండాల్సిందే.

**– గోగ్గల రామయ్య, రైతు, సీతానగరం గ్రామం, ఆళ్ళపల్లి మండలం**

## మూడు గంటల కరెంట్‌తో కష్టాలు తప్పవు



కాంగ్రెస్ వాళ్లు అన్నట్లు మూడు గంటల కరెంట్ ఇస్తే రైతులకు మళ్లీ కష్టాలు తప్పవు. 24 గంటల కరెంట్‌తో ప్రస్తుతం రైతులకు హాయిగా ఉన్నారు. ఎప్పుడంటే అప్పుడు పొలానికి వెళ్లి నీళ్లు పెట్టుకుంటున్నాము. అట్లాంటిది కాంగ్రెస్ వాళ్లు కరెంటు మూడు గంటలు ఇస్తామంటే పొలాల వద్ద కరెంట్ కోసం కాపాలా కాయాల్సి వస్తుంది. పగలు వస్తదో రాత్రి వస్తదో తెలియక పొలాల వద్ద పడుకోవాల్సి వస్తుంది. ప్రస్తుతం రైతుల సంక్షేమం కోసం కరెంటు ఇస్తున్న కేసీఆర్‌కే నా మద్దతు. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కే ఓటు వేసి రుణం తీర్చుకుంటాం.

**– బానోత్ మంగీలాల్, రైతు, గాంధీనగర్, జూలూరుపాడు**